క్లుప్తంగా

భవానీమాతకు వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి పూజలు చేస్తున్న అశోక్‌చారి దంపతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి వెనకాల ఉన్న భవానీ మాత ఆలయంలో అమ్మవారికి సోమవారం పట్టణానికి చెందిన అశోక్‌చారి దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు

షాబాద్: గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను పూడ్చి వేయించామని సాయిచైతన్య యువజన సంఘం అధ్యక్షుడు ఎండీ ఇనాయత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం నుంచి బోడంపహాడ్ వరకు గల రోడ్డుపై పడిన గుంతలను మట్టి పోసి పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులందరి భాగస్వామ్యంతో సుమారు రూ.1లక్ష వరకు ఖర్చు చేశామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేకు ఈ రోడ్డు మరమ్మతుల విషయమై ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు, నాయకులు ఎవరు స్పందించకపోవడంతో రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు గ్రామస్తుల సహకారంతో ముందుకొచ్చామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద్, నర్సింహ, భీమయ్య, అంజయ్య, నరేశ్, రాజు, వెంకటేశ్, సుదర్శన్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, బందీశ్వర్, రాఘవేందర్, గ్రామస్తులు ఉన్నారు.

పండుగకు వెళ్లేవారు సూచనలు పాటించాలి

సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి

హుడాకాంప్లెక్స్: దసరా సెలవులకు స్వగ్రామాలకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి ప్రజలకు సూచించారు. బంగారం, వెండి, నగదు వంటి వస్తువులు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని చెప్పారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని కోరారు. బస్సుల్లో ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు సూచించారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

కందుకూరు: సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకుంటూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని రాచులూరుకు చెందిన రైతులకు మంజూరైన ఎల్‌టీ రుణాలను సోమవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. పద్మగౌడ్, ధనుంజయ్‌గౌడ్, ప్రవీణ్‌కు రూ.7 లక్షల చొప్పున మంజూరైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ బలోపేతంతోనే రైతులకు అవసరమున్న సమయాల్లో సులభంగా రుణాలు ఇచ్చే వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.పాండురంగారెడ్డి, సిబ్బంది మహేశ్, పర్వతాలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని శ్రీహిల్స్ కాలనీలో అధికారులు సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సహకారం అందించిన మాజీ మేయర్ చిగురింత పారిజాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, శ్రీహిల్స్ కాలనీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్, కోశాధికారి ప్రభాకర్, కాలనీవాసులు సత్యనారాయణ ఉన్నారు.

అంగన్‌వాడీ.. అసౌకర్యాల బడి

వెంటాడుతున్న మౌలిక వసతుల కొరత

- సొంత భవనాలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బయట చదువుకుంటున్న చిన్నారులు(ఫైల్)

కొత్తూరు: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో ఉండే 1 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు విద్యతో పాటు సకాలంలో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా వాటి నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో చిన్నారులకు కనీస వసతులు, సౌకర్యాలు కరువయ్యాయి. అధికారులు, ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు అన్ని వసతులు, సౌకర్యాలతో కొనసాగుతున్నట్లు తెలుపుతున్నాయి. కానీ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కేంద్రాల్లో చిన్నారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్స్‌తో పాటు పలు సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అంగన్‌వాడీలు, చిన్నారులు ఇలా..

మండలంలో మొత్తం 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కాగా మండలంలో 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు 1,120 చిన్నారులు, 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు 610 మంది ఉన్నారు. వారిలో 1,180 మంది చిన్నారులు కేంద్రాలకు వెళ్తున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అంతేకాకుండా 242 మంది గర్భిణులు, 216 మంది బాలింతలు ఈ కేంద్రాల పరిధిలో ఉన్నారు.

సమస్యలు ఇవీ..

- మండలంలో 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 15 కేంద్రాలకు సొంత భవనాలు లేవు.
- ఆయా గ్రామాల్లోని అదనపు తరగతి గదులు, కమ్యూనిటీ హాళ్లు, డ్వాక్రా భవనాల్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి.
- సగానికిపైగా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో లేవు. దీంతో చిన్నారులతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉండగా.. మరికొన్ని కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు లేవు.
- కొన్నిచోట్ల కేంద్రాలు చిన్న చిన్న గదుల్లో కొనసాగుతున్నాయి. దీంతో వర్షాలు కురిస్తే కేంద్రాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.
- అంగన్‌వాడీ కేంద్రాల గదులు ఇరుకుగా ఉండడంతో చిన్నారులను ఆడించడానికి స్థలం కరువైంది.
- ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం పలు ఆట వస్తువులు, క్రీడా సామగ్రిని అందిస్తోంది. కాగా స్థలాభావం కారణంగా కొన్ని కేంద్రాల్లో ఆట వస్తువులను మూలన పెట్టాల్సి వస్తోంది.

సౌకర్యాల లేమి.. అందని సేవలు..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అనుకున్న లక్ష్యాలను రాబట్టడం లేదు. వాటి నిర్వహణకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు, వసతులు కరువయ్యాయి. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అన్ని సేవలు అందడం లేదు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి షాద్‌నగర్‌లో సదరం క్యాంపు ఏర్పాటు చేయిస్తున్న ఎమ్మెల్యేను సోమవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) సంఘం నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తమకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక రుణాలు అందించాలని, అంత్యోదయ కార్డులు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. త్వరలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్‌లో దివ్యాంగుల కోసం సదరం శిబిరం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పలుమార్లు సంప్రదించి మంజూరు చేయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌డీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి, దివ్యాంగులు, యాదయ్య, నెహ్రూ, శంకర్, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మినీస్టేడియంలో నిర్మించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం విద్యా, వైద్య, క్రీడారంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇటీవల మినీ స్టేడియంలో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని స్పష్టం చేశారు. యువతీ, యువకులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, జమ్రుద్‌ఖాన్, బాల్‌రాజ్, అసద్, కబీర్ అహ్మద్, రవితేజ, మున్నా, మతీన్, శివ, టిప్పు, మహమూద్, ఆయాస్, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్, కేశవ్, షరీఫ్, జోహెబ్, మధు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కొందుర్గు: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.30 లక్షలతో నిర్మించనున్న నాలుగు అదనపు గదులకు భూమిపూజ చేశారు. రావిర్యాల వాగుపై రూ.3.50 కోట్లతో నిర్మించనున్న హై లేవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం రావిర్యాలలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు ఇళ్లపై నుంచి ఉన్నాయని గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల తహసీల్దార్లు అజాంఅలీ, జగదీశ్వర్, ఎంపీడీఓలు అనురాధ, ప్రవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతోనే పల్లెలు అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండలంలోని నాంచేరిలో సోమవారం రూ.5 లక్షల ఎంపీ నిధులతో సీసీరోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర సహకారమే ఎక్కువగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉందని, ఇందులో భాగంగానే గతంలో ఎవరూ చేయని విధంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎంపీ నిధులను భారీగా తీసుకొచ్చినట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వరకు గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో కేంద్రం నుంచి నిధులు వచ్చాయన్నారు. రెండేళ్లు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రవీందర్‌రెడ్డి, జైశంకర్, అమరేందర్, జి.వెంకట్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, కుమార్, జయసింహ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్, నందిగామ, బాలానగర్, నవాబ్‌పేట, కొత్తకోట, పెబ్బేర్, మరికల్, తిమ్మాజీపేట, మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.3 లక్షల 60 వేల విలువ గల చెక్కులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నంద కిషోర్, మాధవి, చెట్ల పావని నర్సింహ, పిల్లి శేఖర్, యాదగిరి, రఘునాథ్ యాదవ్, రామకృష్ణ, నక్కల వెంకటేశ్, రవీందర్ రెడ్డి, జేకే నర్సింలు, మచ్చేందర్, జంగిలి కుమార్, మధుసూదన్, కాట్న శేఖర్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బోరుమోటార్‌ను ప్రారంభించిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నయ్య, గ్రామ నాయకులు

షాబాద్: తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో ఉన్న రెండు బోరు మోటార్లు పనిచేయకపోవడంతో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యపై స్పందించిన ఆయన రూ.60 వేలు ఖర్చుచేసి రెండు మోటార్లుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ముందుకు వస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్వ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి శోభ, నాయకులు పాపిరెడ్డి, శ్రీను, ప్రభాకర్, సాయి, కృష్ణారెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్యాధికారి మానసరెడ్డి



పాడిరైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

శంకర్‌పల్లి: గ్రామాల్లోకి ఏర్పాటు చేస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి పశువైద్యాధికారి మానస రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగూడలో సోమవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పునరుత్పత్తి పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు ఉచితంగా పునరుత్పత్తి పరీక్షలు చేశారు. మూగజీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాడి పశువులను జాగ్రత్తగా కాపాడుకుంటేనే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 37 ఆవులకు, 21 గేదెలకు గర్భకోశ చికిత్సలు, పాల దిగుబడికి సంబంధించిన చికిత్సలు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు 42 దూడలకు, 45 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పశువులకు ఏ సమస్య వచ్చిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ డాక్టర్ రామన్న, పశువైద్య సిబ్బంది రాజ్యలక్ష్మి, భరత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఇబ్బందిపడిన జనం



కాశీంబౌలిలో కురుస్తున్న వర్షం



అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఉరుములతో భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు చేసేందుకు భక్తులు, యువజన సంఘాలు సభ్యులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. అదేవిధంగా పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి.

'గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం'

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తూ హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మోతీలాల్‌నాయక్ అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని చూడటంతో పాటు అణిచివేతకు గురిచేస్తున్నందుకుగాను ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి వెళ్లనీయకుండా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో లంబాడీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరంకుశత్వ ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

యూరియా పంపిణీ

కందుకూరు: మండల కేంద్రంతో పాటు రాచులూరులో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కందుకూరు పీఏసీఎస్‌కు 450 బస్తాలు, రాచులూరుకు 450 బస్తాలు రాగా ఏఓ లావణ్య, సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు.



కొందుర్గు: ముట్పూర్‌లో..



చేవెళ్ల: రచ్చబండ వద్ద దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు

మురుగు పారి.. దుర్గంధం వ్యాపించి



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీటిని చూపిస్తున్న కాలనీవాసులు

షాబాద్: డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లిలో గత నాలుగు నెలలుగా రోడ్లపైనే మురుగు నీరు పారడంతో ఇబ్బంది పడుతున్నామంటూ ఎస్సీ కాలనీవాసులు సోమవారం ఆందోళనకు దిగారు. ఇళ్ల మధ్యన మురుగు నిలవడంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఈ సమస్య తీవ్రమవుతోందని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సమస్య తలెత్తిందని, తక్షణమే స్పందించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మొదటిరోజు భక్తులు, ఉత్సవాల కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నైవేద్యం, వస్త్రాలు సమర్పించారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



షాద్‌నగర్: గాంధీనగర్ కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు



శంకర్‌పల్లి: సింగాపురంలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న యువకులు



షాబాద్: అమ్మవారి పూజలో పాల్గొన్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: రక్తమైసమ్మ దేవాలయంలో..